కథ

# బామ్మ ఉపదేశం

విశ్వనాథ గణపతిరావు

**నాకేమిటోగానీ ఈమధ్య ఆఫీసులో అస్సలు నిద్రపట్టడం లేదు.**

**గతంలో అయితే మధ్యాహ్నం భోజనం చేసిన తరువాతైనా కనీసం ఓ రెండు గంటలు కుర్చీలో కూర్చుని అయినా నిద్రపోయేవాడిని. ఆ విషయమై మా ఆఫీసరూ ఓసారి నన్ను నిలదీసి అడిగారు కూడా!**

''ఏమిటోయ్ క్రిష్ణమూర్తి! రాత్రులు ఇంటి దగ్గర అస్సలు నిద్రపోవా? ఆఫీసుకొచ్చి నిద్రపోతుంటావు?!'' అని.

దానికి నేను ఆవులిస్తూ లేచి నిలబడి, నిద్రమత్తు వదిలించుకునే ప్రయత్నంలో ఒళ్లు విరుచుకుని ''నాకూ అర్థం కానిదదే సార్! రాత్రి తొమ్మిదింటికే నిద్రపోయి ఉదయం ఆరుగంటల వరకూ సుషుప్తావస్థలోనే గడిపి ''ఆఫీసుకి టైమవుతోంది, లేవండి'' అని మా ఆవిడ ఓ నాలుగు సార్లు నన్ను కుదిపి కుదిపి మేల్కొలిపితేగానీ నిద్రలేవనండి. అయినా ఇదేం నిద్రో! ఆఫీసులోనూ నా రెండుగంటల కోటా నిద్రా తీస్తేనేగానీ నా మనసు, తనువు తేలికపడవండి. ఈ నా శరీరావస్థకు కారణమేమిటో మీకేమయినా తెలిస్తే కాస్త చెప్పి పుణ్యం కట్టుకోండి సార్'' అనగానే-

''నాకు తెలియదు'' అని ఏ విషయంలోనూ కాంప్రమైజ్ కాని మా ఆఫీసర్ మెల్లగా అక్కడి నుండి జారుకున్నాడు.

ఆయనలా వెళ్లగానే నేనిలా వెంటనే నిద్రలోకి జారుకున్నాననుకోండి. కానీ ఇప్పుడెందుకు నిద్ర రావడం లేదు అన్నదే ప్రశ్న! ఆ ప్రశ్న ఆఫీసులో కొలీగ్స్ అందర్నీ అడిగాను. దానికి ఒక్కొక్కరూ ఒక్కొక్క కారణం చెప్పారు.

''నీ ఒంట్లో జబ్బేమైనా ప్రవేశించిందేమో!'' అంది మా స్టెనోగ్రాఫర్ నీరజ.

''అలా మితిమీరి నిద్రపోవడమే ఓ జబ్బు. అలాంటిది నిద్రపోకపోవడం జబ్బేమిటి? నా శాల్తం'' అన్నారు మా హెడ్‌క్లార్కు రామలింగం, డబ్బాలో నశ్యం చూపుడువేలు, బొటనవ్రేలు మధ్య బంధించి తీసి నాసికారంధ్రాల మధ్య పెట్టి ఓ పట్టున పీల్చి, ఆ ఘాటుకు ఓ కన్ను మూసి, మరో కన్నుతో నావైపు చూస్తూ.

''అదేం కాదు సార్. కొందరి శరీర తత్వాన్ని బట్టి, ఒంట్లో అవయవాలు ఎక్కువ విశ్రాంతి కోరుకుంటాయి గనుక అలా నిద్ర ఎక్కువగా వస్తుంది'' అన్నాడు మా ప్యూన్ అప్పలరాజు, హెడ్‌క్లార్కు మాటల్ని కొట్టిపారేస్తూ.

వాడి వైపు గుర్రుగా చూస్తూ, ''చాలు చాలు లేరా! నువ్వేదో శాస్త్రజ్ఞుడిలా శరీరతత్వాన్ని గురించి చెప్పేస్తున్నావు. అంత తెలిసినవాడివి, తెలివిగలవాడివీ అయితే ఇలా ఇక్కడ ఈ ప్యూన్ ఉద్యోగమెందుకు వెలగబెడతావు?!'' అంటూ ''ఇదిగో! ఈ ఫైల్ పట్టుకెళ్లి ఆఫీసర్‌గారి ముందు తగలెయ్'' అంటూ తన టేబుల్ మీద ఉన్న ఫైల్, స్టూలు మీద కూర్చుని ఉన్న ప్యూన్ మీదికి విసిరాడు.

''ఈమాత్రం ఇసయానికి సమాధానం చెప్పడానికి నేనంత పెద్దాయన్ని కానవసరం లేదు. అంత పెద్ద ఉజ్జోగం చెయ్యనవసరం లేదండి. అన్నం తినే ఏపాటివాడైనా గ్రహించగలడు'' అంటూ తనకు తగిలి కిందపడ్డ ఫైలుని వంగి అందుకుని, ఆఫీసర్ ఛాంబరు వైపుకి కదిలాడు, మా ప్యూన్ అప్పలరాజు.

వాడి మాటలకు షాకయిన మా హెడ్‌క్లార్కు రామలింగం, ''అమ్మో! ఎంత మాటన్నాడు వెధవ... అంటే మనమంతా గడ్డి తింటున్నామనుకుంటున్నాడా వాడు...'' అంటూ కొశ్చన్ మార్కు ఫేసుతో అందరివైపూ దిక్కుచిలా తలాడించి చూస్తూ అడిగారు రామలింగం గారు.

''వాడన్నది అందర్నీ కాదండి. మీ ఒక్కర్నే! మమ్మల్నెందుకు అనవసరంగా కలుపుతారు?'' అన్నాడు ఆనందరావు. అతడు మా ఆఫీసులో క్లార్కు. ఉదయం ఆలస్యంగా ఆఫీసుకొచ్చాడని, ఆఫీసర్‌కి కంప్లయింట్ ఇచ్చి చీవాట్లు పెట్టించాడు హెడ్‌క్లార్కు. అతడి మీది ఆ కోపం ఇప్పుడిలా మాటల్లో తీర్చుకుని, నావైపు తిరిగి గుంభనగా నవ్వుకున్నాడు.

ఎవరెవరి కోపాలు, తాపాలు వాళ్లు తీర్చుకోవటమేగానీ నా సమస్యకు సమాధానం మాత్రం కరెక్టుగా ఎవరూ చెప్పలేకపోతున్నారు. అందుకే నా సమస్యకు కారణం నేనే ఆలోచించుకుని ఓ నిర్ణయం తీసుకుని గతంలోలాగానే మరలా ఆఫీసులో నిద్రపోవాలనుకున్నాను.

దానికి దీర్ఘంగా ఆలోచించాను. రాత్రి, పగలూ ఆలోచించాను. అప్పుడూ, ఇప్పుడు అని లేదు. అలా ఇలా అని లేదు. కూర్చుని, నించుని, నడుస్తూ అన్ని భంగిమల్లోనూ ఆలోచించాను.

అంతలా శ్రమించి ఆలోచించినా నా సమస్యకు పరిష్కారం దొరకలేదు. పైపెచ్చు కొండనాలికకు మందేస్తే ఉన్న నాలిక ఊడిపోయిందన్నట్టు ఆఫీసులో నిద్రమాట ఎలా ఉన్నా ఇప్పుడు ఇంటి దగ్గరా నిద్రపట్టడం లేదు. కళ్లు మంటలు, కాళ్లపీకులు, అజీర్తి, నీర్సం మొదలయ్యాయి.

నా ఈ పరిస్థితికి మా ఇంటిల్లిపాదీ ఆందోళన పడిపోయారు. నా భార్యయితే ఏకంగా డాక్టర్ దగ్గరికి నే వద్దంటున్నా వినిపించుకోకుండా తీసుకుపోయి విషయమంతా నాతోనే ఆయనకు చెప్పించింది. దానికి డాక్టర్ చిన్నగా నవ్వి ఏవో మాత్రలు రాసిచ్చి ఫీజు తీసుకుని పంపించేశారు.

ఆ మాత్రలు వేసుకుంటే రాత్రులు కాస్త నిద్రపట్టినా ఆఫీసులో మాత్రం పరిస్థితి షరా మామూలే! ఓ క్షణం కునుకుపడితే ఒట్టు! ఆ విషయమే మరలా వెళ్లి డాక్టర్‌గారిని అడిగితే, ఈసారి విరగబడి నవ్వి, ''ఇదేంటయ్యా? ఆఫీసుకెళ్లి జీతం తీసుకుంటున్నందుకు కష్టపడి పని చేయాలిగానీ నిద్రపోతానంటావేమిటి? అయినా నీకు నిద్రే ముఖ్యమనుకుంటే అవే మాత్రలు కంటిన్యూ చెయ్యి. కొద్ది రోజులకు నీకు ఆఫీసులో చచ్చినట్టు నిద్ర వచ్చి తీరుతుంది'' అంటూ మరలా నవ్వి రెండోసారి కూడా ఫీజు లాక్కుని మరీ పంపించాడు.

ముఖం వేళ్లాడేసుకొచ్చిన నన్ను చూసి నా భార్య, కూతుళ్లు, అల్లుళ్లు, కొడుకు, కోడలు, చివరికి మనవడు కూడా లోలోపలే నవ్వుకున్నారేగానీ నాకు సూచనప్రాయంగా కూడా సలహా ఇవ్వలేకపోయారు.

అదే నాకు బాధనిపించింది. నా మనసు, శరీరం ఊరట పొందే మార్గాన్ని ఏ ఒక్కరూ చెప్పలేకపోగా నన్నో పిచ్చివాడ్ని చూసినట్టు చూసి నవ్వుతారేం అని నాకనిపించింది.

అసలు వీళ్లకు నిద్ర విలువ ఏం తెలుసునని నవ్వుతున్నారు? ఎవరూ ఏమీ అనుకోకపోతే నిద్రను మించిన సుఖమే లేదు.

నాకు నిద్రమాత్రలు అలవాటయ్యాయో ఏమో! మాత్ర వేసుకుంటేనేగానీ నిద్ర రావడం లేదు.

ఓరోజు వేసుకున్నా నిద్ర రాక డాబామీద అటూ ఇటూ, పిట్టగోడనానుకుని పచార్లు చేస్తుంటే, ఓ చల్లని చెయ్యి నా భుజంపై పడింది.

గబుక్కున వెనుతిరిగి చూశాను.

నాన్నమ్మ! ఎనభై ఏళ్లకు పైబడిన వయసు. ముడతలు పడిన ముఖంతో పత్తికాయల్లాంటి కళ్లను బలవంతంగా విప్పార్చి చూస్తూ, ''ఒరేయ్ రంగా! నిద్ర రావడం లేదా?'' అంటూ నన్ను అనునయంగా అడిగింది.



నాపేరు క్రిష్ణమూర్తి అయినా నానమ్మ మాత్రం నన్ను రంగా అనే పిలుస్తుంది. పైపెచ్చు, ''ఆ శ్రీరంగనాథుడిలా నీవూ ఏ పేరుతో పిలిచినా పలకాలిరా'' అంటుంది. అందుకే నానమ్మ ఆదేశం మేరకు నేనూ పలుకుతూ పెదవి విప్పేలోగానే-

''చెప్పరా రంగా! నిద్ర రావడం లేదా?'' అంటూ మరలా అడిగింది నానమ్మ.

''లేదు నానమ్మా! నిద్ర నన్నింత మోసం చేస్తుందనుకోలేదు. ఇన్నాళ్లూ నన్నెంత అంటిపెట్టుకుని ఉండేదో ఇప్పుడంత దూరమయిపోయింది. ఎందుకిలా జరుగుతుంది నానమ్మా...'' అంటూ అడిగాను బేలగా.

''దానికొక్కటే కారణం రా...'' అంటూ మూడొంతుల జుట్టు రాలి నున్నగా అయిన నా బట్టబుర్రను నిమురుతూ అంది.

''కారణం నీకు తెలుసా? అయితే ఏమిటో వెంటనే చెప్పు నానమ్మా...'' అంటూ ఆత్రంగా అడిగాను.

''దీనికి పెద్దగా కారణమేమీ ఉండదురా రంగా... నీ జీవితంలో నిన్నకాక మొన్నటివరకూ ఆర్థిక, మానసిక బాధలేమీ లేవు గనుక నీకు ఎక్కడ బడితే అక్కడ హాయిగా నిద్రపట్టేది. కానీ ఇప్పుడు నీ పరిస్థితి అది కాదు. ఇద్దరు కూతుళ్లకూ, కొడుక్కీ కూడా పెద్ద చదువులు చదివించి పెళ్లిళ్లు చేశావు. ఆర్థిక స్థోమత సరిపోక అప్పులు చేశావు. ఉన్న భూమి అమ్మావు. వచ్చే జీతంరాళ్లలో సగం అప్పులకు పోగా, మిగతా జీతం ఇంటి అవసరాలకు సరిపోవడం లేదు. దానికి మళ్లీ అప్పులు చేస్తున్నావు. ఇవి ఎలా తీరుతాయా అని మథనపడుతూ నిద్రకు దూరమవుతున్నావేగానీ అది నిన్ను మోసం చేయడమూ కాదు. ఏమీ కాదు'' అంటూ దళసరి సోడాబుడ్డీ కళ్లద్దాలలోంచి నావైపు లాలనగా చూసింది.

''అందుకే ఓ పని చెయ్యరా రంగా'' అంది మరలా తనే.

''ఏం చేయమంటావు నానమ్మా...'' మరింత ఆత్రంగా అడిగాను.

''కష్టపడి ఆఫీసులో అధిక గంటలు పని చెయ్యి! నీ పనయిపోతే పని భారంతో సతమతమయ్యే నీ తోటి పనివారలకు సాయం చెయ్యి! ఎట్టి పరిస్థితిలో ఖాళీగా ఉండకు. ఖాళీగా ఉన్న బుర్ర దెయ్యాల గుహతో సమానం. అనవసరమైన ఆలోచనలను ప్రవేశపెట్టి నీ మనసును పాడు చేస్తాయి. ముఖ్యంగా నిద్రకు దూరం చేస్తాయి. కనుక నామాట విను. ఆఫీసులో నిద్రపోయి అందరితో ఛీత్కారాలు పొందేకన్నా పనిభారం పెంచుకుని అలసిన మనసుతో రాత్రులు ఇంటిదగ్గర తృప్తిగా నిద్రపో... అది నీకు శారీరకంగా, మానసికంగానే కాకుండా ఆర్థికంగా కూడా లాభసాటిగా ఉంటుంది'' అంటూ నానమ్మ చెప్పేసరికి, ఆమె ఉపదేశం నా మనసునెంతో తేలికపరిచింది. నిద్రమాత్రల అవసరం లేకుండా చేసింది.

అప్పటి నుండి ఆఫీసులో మాత్రం పనిలో పడి మెలకువగానే ఉండడానికి ప్రయత్నిస్తున్నాను. అప్పుడప్పుడు నిద్రపోతున్నాననుకోండి. అది మాత్రం రహస్యం. ఎవరితో చెప్పకండి... ప్లీజ్!